# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 తేది. 26-10-2014

కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకున్న 265 టిఎంసి నీళ్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడానికి అనువుగా చెరువులను పునరుద్ధరించుకోవాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చెప్పారు. సచివాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, విద్యాశాఖ మంత్రి జగదీష్ రెడ్డి, ప్రభుత్వ కార్యదర్శులు నాగిరెడ్డి, జోషి, నీటిపారుదల శాఖ సిఇ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రాంతంలో 265 టిఎంసిల నీటిని నిల్వ చేసే సామర్థ్యం చెరువులకు ఉండేదని, సీమాంధ్రుల పాలనలో ఆ చెరవులన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయని, అందువల్లనే పూర్తి స్థాయిలో తెలంగాణకు కేటాయించిన నదీ జలాలను ఉపయోగించుకోలేకపోయామని ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పుడు చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం ద్వారా కేటాయించిన నీళ్లను వాడుకోవాలని వివరించారు. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం పూర్తి స్థాయిలో పారదర్శకంగా, వేగంగా, ప్రణాళికా బద్ధంగా జరగాలని ముఖ్యమంత్రి చెప్పారు. మొదటి దశలో 9 వేల చెరువులను పునరుద్ధరించాలని నిర్ణయించామని, ఆ పనులు ఈ డిసెంబర్లో ప్రారంభం కావాలని చెప్పారు. ఇందుకోసం దాదాపు 4,500 ఖర్చు అవుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. మొదటిదశలో పునరుద్దరించిన చెరువుల్లో వచ్చే వర్షాకాలంలో నిండుగా నీరు నిండాలని, ఆ గ్రామాల్లో ఖరీఫ్ పంటలు బాగా పండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. చెరువుల పునరుద్దరణ పనులన్నీ టెండర్ విధానంలోనే జరగాలని, ఇందుకోసం ఇ ప్రొక్యూర్ మెంట్ విధానాన్ని అవలంభించాలని కూడా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నామినేషన్లపై పనులు

ఇచ్చే ఉద్దేశ్యం లేదని వెల్లడించారు. టెండర్లు పిలవడానికి కూడా ఇబ్బంది లేకుండా అధికారులకు టెండర్లు పిలిచే పరిమితిని పెంచాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇఇలకు రూ.50 లక్షల వరకు, ఎస్ఇలకు రూ.కోటి వరకు, సిఇలకు కోటికి పైగా పనుల టెండర్లు పిలిచే అధికారం అప్పగించాలని నిర్ణయించారు. పెద్ద ఎత్తున చెరువుల పునరుద్ధరణ పనులు చేపడుతున్నందున రాష్ట్రంలో చిన్ననీటి వనరుల శాఖను పునర్వ్యవస్థీకరిచాలని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి, కృష్ణా బేసిన్లకు వేర్వేరుగా సిఇ లను నియమిస్తారు. అంటే తెలంగాణకు ఇకపై ఇద్దరు సిఇలుంటారు. జిల్లాకో ఎస్ఇ, రెండు మూడు నియోజకవర్గాలకు కలిపి ఒక ఇఇ, నియోజకవర్గానికో డిఇ, మండలానికో ఎఇ ని నియమించాలని, కొత్తగా అధికారుల నియామకం చేపట్టాలని కూడా ముఖ్యమంత్రి నిర్ణయించారు. సర్వే పనులకు అవసరమైన ఎక్విప్ మెంటు, లాప్ టాప్ లు సమకూర్చడానికి కూడా ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. చెరువుల పునరుద్దరణ పనులకు సంబంధించిన మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏ గ్రామంలో అయితే రైతులు స్వచ్చందంగా పూడిక మట్టి తీసుకుపోవడానికి ముందుకు వస్తారో అదే గ్రామానికి ప్రాధాన్యత ఇవ్వాలని కూడా చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో ఒక చెరువును మినీ టాంక్ బండ్ గా మార్చాలని సూచించారు. అందులో నీళ్లుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా మంచినీటి సమస్య కూడా కొంత వరకు తీరుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. చెరువు ఊరి బరువునంతా మోసే వనరు కాబట్టి, చెరువుల పునరుద్దరణ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. కేవలం రైతులే కాకుండా అన్ని వర్గాలకు కూడా చెరువుల వల్ల మేలు కలుగుతుందన్నారు. చెరువుల పునరుద్ధరణ ఓ ప్రభుత్వ కార్యక్రమలంగా కాకుండా, ప్రజా ఉద్యమంగా సాగాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఎన్ఎస్ఎస్, ఎన్సిసి, స్కౌట్స్, గైడ్స్, స్వచ్చంద కార్యకర్తలు ఇందులో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ఎన్ఆర్ఐలు కూడా చెరువులను దత్తత తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అలా

దత్తత తీసుకుంటే వారు చెప్పిన వారి పేరును చెరువుకు పెడతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. చెరువుల పునరుద్ధరణపై బావి తరాలకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు.

---------------------------------------------------------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం